క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గ్రామంలో వడ్డీల వీధిలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పాల్గొన్నారు.

నేడు అప్పనపల్లిలో లక్ష దీపోత్సవం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో కార్తికమాసం సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటలకు విశేష లక్ష దీపోత్సవం ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ పూజ ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ పూజలకు హాజరు కావాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన భాగవతుల సత్యనారాయణ మూర్తి, అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భాగవతుల లక్ష్మీనరసింహం-పద్మావతి దంపతులు శుక్రవారం బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 వేలు విరాళం అందించారు. వారికి లడ్డూ ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. అలాగే మామిడికుదురులో కొలువు తీరిన అభయాంజనేయస్వామికి శనివారం సుందరకాండ సహిత లక్ష తమలపాకుల పూజ జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది.

మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలి

మామిడికుదురు: రైతులు పండించిన పంటకు తగిన మద్దతు ధర అందించి వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్పర్సన్ యూవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్పర్సన్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, సీఈఓ యర్రంశెట్టి ఏసు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

రావులపాలెం: మండలంలోని ఈతకోట హైస్కూల్‌కి చెందిన 25 మంది క్రీడాకారులకు గ్రామానికి చెందిన జి.కుమార్ స్వామి రూ.15 వేలతో క్రీడా దుస్తులను అందించారు. ఈ దుస్తులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ చైర్మన్ తేజ, పీటీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

మామిడికుదురు: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి మంజూరు చేసిన హౌసింగ్ నిర్మాణాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌జేవీ రామ్మోహనరావు పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న లేఅవుట్లలో 75 గృహాలు, సొంత స్థలంలో 31 ఇళ్ల నిర్మాణాలు వెరసి 101 ఇళ్ల నిర్మాణాలను జనవరి 31వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈదరాడ, గెద్దాడ, మొగలికుదురు, పాశర్లపూడిలంక జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో కట్టుకునే వారికి మంజూరు చేసిన గృహాల నిర్మాణాన్ని కూడా త్వరితంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ కె.అయ్యప్పనాయుడు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి
- జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



మలికిపురం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక



నగరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం మలికిపురం సచివాలయం వద్ద సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మలికిపురం రెండు సచివాలయాల పరిధిల్లో రూ.31 కోట్ల మేర అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తొలుత సచివాలయం-1 వద్ద సంక్షేమ పథకాల బోర్డుతో పాటు, మొత్తం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికి పంపిణీ చేయబడిన మొత్తాన్ని హైలెట్ చేస్తూ డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎంపీడీవో ఎం.వీరాస్వామి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, సీనియర్ నాయకులు కేఎస్ఎన్ రాజు, గెడ్డం తులసీభాస్కరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ చింతా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నగరంలో జరిగింది. నగరం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంక్షేమ పథకాలకు రూ.70 కోట్లు కేటాయించిన ఘనత జగన్ సర్కారుకే దక్కిందన్నారు. ఇది చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. రూ.కోట్లు కేటాయిస్తున్న జగన్ సర్కారు మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, తేతలి మోహనరెడ్డి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: ఎలాంటి వివక్ష చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాజోలు-3 గ్రామసచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయం పరిధిలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ప్రదర్శించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, గ్రామశాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు, నాయకులు బందారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

మోరిపోడులో..

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్, డోర్ టూ డోర్ క్యాంపెయిన్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించాయి. పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ కలసి ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని తెలియజేశారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: రాష్ట్రాభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్ మళ్లీ రావాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని జొన్నాడలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. నాలుగేన్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.

నరేంద్రపురంలో..

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం-2 గ్రామ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డును సొసైటీ అధ్యక్షుడు మెల్లం మహాలక్ష్మి ప్రసాద్ ఆవిష్కరించారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, జల్లి పండు, రాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

నందంపూడిలో..

అంబాజీపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాలు తిరిగి అమలు జరగాలన్నా, రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలన్నా అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు అన్నారు. నందంపూడిలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన డిసిప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణానికి భూమిపూజ



శ్మశానవాటిక నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం శ్మశానవాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఎంపీ నిధులు రూ.10 లక్షలు, జెడ్పీ నిధులు రూ.5 లక్షలు, జీజీఎంపీ రూ.4 లక్షల నిధులతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్సీ చిట్టిబాబు తెలిపారు. తొలుత అయినవిల్లి వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్లచెరువు జిల్లా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వంట పాత్రలను నిర్వాహకులకు అందజేశారు. గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను గెలిపించుకోవాలి



అంతర్వేదికరలో పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రానున్న రోజుల్లో జగనన్నను సీఎంగా గెలిపించుకోవడం ద్వారా ఇప్పటి సంక్షేమ పాలనను యథాతథంగా కొనసాగించుకోవచ్చని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం అంతర్వేదికరలో 252వ రోజు ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పాలన జగనన్న చేస్తున్నారని, ప్రభుత్వంలోను, పాలనలోనూ వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, గ్రామ అధ్యక్షుడు కొల్లా బత్తుల ధర్మారావు, నాయకులు కేఎస్ఎన్ రాజు, గెడ్డం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసుబాబు, చెల్లుబోయిన గోపాలకృష్ణ, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఆత్రేయపురం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఓటుద్వారా భవిష్యత్‌ను మార్చుకోవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఆత్రేయపురంలో శుక్రవారం ఆయన ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభించారు. అంతే కాదు ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేది కేవలం ఓటు మాత్రమేనని అలాంటి ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కును కలిగి ఉన్నవారు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆత్రేయపురంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభించారు. ఆత్రేయపురం ప్రధాన కాలువలో ఈతల పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభించారు. వీటి వలన గ్రామ స్థాయిలో క్రీడా కారుల నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆర్డీవో ముక్కంటి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ నాతిబుజ్జి, రెడ్‌క్రాస్ సిబ్బంది ప్రకాశ్ తదితరులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

ఆలమూరు: హిందూ ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో నిర్వహిస్తున్న ధర్మపథం కుంకుమ పూజలు మండలంలోని పినపళ్లలో శుక్రవారం వైభవంగా జరిగాయి. చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఏడో విడత స్థానిక గ్రామదేవత గొల్లాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో వేద పండితులు పి.నరసింహమూర్తి, కొత్తూరి రాము మంత్రోచ్ఛారణల మధ్య ఈ పూజలను నిర్వహించారు. ఈ ధర్మపథం కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తులకు పూజ సామగ్రిని ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ డి.భాస్కర శ్రీనివాసు సమకూర్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ సర్పంచ్ కోట బూరయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు విజ్జన అబ్బు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు శిబిరాలు

మామిడికుదురు: కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు శనివారం నుంచి రెండు రోజులు ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లోని 60 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలకు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు బీఎల్వోలను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటరు నమోదు పై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే నమోదైన ఓటర్ జాబితాలను సచివాలయ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. బీఎల్వోలకు ప్రత్యేక సూచనలు చేశామన్నారు. కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు తదితర వాటిని నమోదు చేయాలన్నారు. మండలంలోని ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



మనోజ్ తల్లిదండ్రులకు సాయం చేస్తున్న శ్రీనివాస్, తదితరులు

మలికిపురం: రాజోలు తాలూకా గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం మామిడికుదురులోని చిన్నారి మనోజ్ వైద్యానికి రూ.36 వేలు ఆర్థిక సాయం తల్లిదండ్రులకు అందజేశారు. ఐ.మనోజ్ గత కొద్దికాలంగా గుండెకు సంబంధించిన సమస్యతోను, లివర్ ఇన్ఫెక్షన్‌తో వైద్యం చేయించుకోలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎన్నారైలు పంపిన పై మొత్తాన్ని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘ మాజీ కార్యదర్శి గుబ్బల శ్రీనివాస్ చేతుల మీదుగా వారికి అందజేశారు. వివరాలను సంస్థ వ్యవస్థాపకుడు కట్టా భాస్కర్ మీడియాకు చెప్పారు. కౌరు మునేశ్వరరావు, దొంగ శ్రీనుబాబు, బైరిశెట్టి వెంకట రమణ, కట్టా శ్రీనివాస్, కడలి రాంబాబు, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

పి.గన్నవరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చి దిద్దుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన వంట పాత్రలను, లైబ్రరీ పుస్తకాలను ఎమ్మెల్యే చిట్టిబాబు శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సీఎం జగన్ రాకతో ఈ పాఠశాలకు ఎన్నో సౌకర్యాలు సమకూరాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైకిలు షెడ్డు నిర్మించాలని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేయగా, రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రకటించారు. విద్యార్థులతో కలసి ఆయన మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. క్రీడల్లో పాల్గొన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంఈఓ కోన హెలీనా, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వర రావు, పార్టీ నాయకులు సాధనాల రమేష్, దాసరి కాశీ, దూనబోయిన రవిచంద్ర పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: స్థానిక బేతెస్థ చర్చిలో శుక్రవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్లప్పుడూ ఇలాంటి సంక్షేమ పాలనే రాష్ట్రంలో ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరంలో విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. దాతల సహకారంతో విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో మంది ఆపన్నులకు ఆసరాగా నిలుస్తున్నాయని వసుధ ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ జంపన బుజ్జిరాజు, దాత డి.శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం రామేశ్వరం పంచాయతీ వద్ద ట్రస్ట్ 11వ వార్షికోత్సవ సభ జరిగింది. సర్పంచ్, ట్రస్ట్ మెంబర్ కట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పై సభలో దాతల సహకారంతో 100 మంది పేదలకు సమకూర్చిన బియ్యం, కొంత నగదును బుజ్జిరాజు, శ్రీనివాసరాజు అందజేశారు. ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పెద్దలు బళ్ల విజయసారథి, వీరా త్రినాథ్, ఈద రవిరెడ్డి, ట్రస్ట్ మెంబర్లు ఏ.మధురాజు, బళ్ల లక్ష్మణ్, చెరుకూరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నంకు ఉత్తమ సేవా అవార్డు



ఉత్తమ సేవా అవార్డు తీసుకుంటున్న వెంకటరత్నం

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఐసీటీసీ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న అడబాల వెంకటరత్నంకు వరల్డ్ ఎయిడ్స్ డే 2023 ఉత్తమ సేవలకుగాను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్టు వెంకటరత్నం తెలిపారు.

ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలిద్దాం



రావులపాలెం హైవేపై మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు/కొత్తపేట/ఆలమూరు/రావులపాలెం/అయినవిల్లి/అంబాజీపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం, ముక్కామల పీహెచ్‌సీలు, కొత్తపేట, ఆలమూరు, అయినవిల్లి సీహెచ్‌సీలు, రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సిబ్బంది, ఉద్యోగులు ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి అని, దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని నినాదాలు చేశారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఎయిడ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ర్యాలీలో పీహెచ్‌సీ ఉద్యోగులు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

75 మంది రైతులకు లంక పట్టాల పంపిణీ



రైతులకు లంక భూమి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రైతుల సంక్షేమానికి సీఎం జగన్ పాటుపడుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. యర్రంశెట్టివారిపాలేనికి చెందిన 75 మంది రైతులకు 22.5 ఎకరాల లంక భూమిని ఐదేళ్ల కాలపరిమితితో పట్టాలను శుక్రవారం ఎమ్మెల్యే చిట్టిబాబు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.భారతి, డీటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు కుడుపూడి రాము, అప్పన వెర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో ఆర్డీవో



స్వామివారి సన్నిధిలో ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీవో జి.కేశవవర్ధన్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు సుదర్శనం రమేష్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికి, చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. రెవెన్యూ అధికారి వి.రామరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

కొత్తపేట: స్థానిక కామిరెడ్డిపాలెం గ్రామదేవత తాళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్తిక శుక్రవారం పురస్కరించుకుని తాళ్లమ్మ అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉసిరి వృక్షం వద్ద పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించి వన సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ మిద్దె సత్యనారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కోమటి మాణిక్యం కుటుంబానికి సాయం అందింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరా రాజు శుక్రవారం బాధిత కుటుంబం వద్దకు వెళ్లి కొంత నగదుతో పాటు 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, వంట పాత్రలను అందజేశారు. పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కటారి గంగరాజు, నాగిరెడ్డి సాయి, సింగారపు గంగరాజు పాల్గొన్నారు.

చెత్త తొలగింపుపై బాధ్యత తీసుకోవాలి

అంబాజీపేట: మేజర్ పంచాయతీ అయిన మాచవరంలో పేరుకుపోయిన చెత్త తొలగింపుపై అధికారులు బాధ్యత తీసుకోవాలని కన్స్యూమర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి అన్నారు. చాలా కాలంగా అపరిష్కృతంగా పేరుకుపోతున్న చెత్త సమస్యను పరిష్కరించడంలో ఏర్పడిన ప్రతిష్ఠంభనను అధికారులు పరిష్కరించడం లేదన్నారు. పేరుకుపోయిన చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతుందని, దాని వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు, పాలక వర్గం పట్టించుకోవడం లేదన్నారు. చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ అలుముకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాజమహేంద్రవరం జిల్లా వినియోగదారుల ఫిర్యాదుల పరిశీలన ఫోరంలో ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

అంబాజీపేట: కె.పెదపూడి మలుపు వద్ద శుక్రవారం లోడు ఆటో ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.పెదపూడి శివారు బీరవారిపేటకు చెందిన బీర చంద్రరావు తన బైక్‌పై పుల్లేటికుర్రు నుంచి ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో అంబాజీపేట నుంచి పుల్లేటికుర్రు వైపు వెళుతున్న ఆటో కె.పెదపూడి మలుపు వద్ద బైకిస్టు చంద్రరావును ఢీ కొట్టింది. దాంతో చంద్రరావుకు తీవ్ర గాయాలు కాగా 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

ఆవులను హింసించిన వ్యక్తిపై ఫిర్యాదు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి సమయంలో పశువుల మకాం వద్దకు వెళ్లి ఆవులను హింసిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన రైతులు ఉమ్మిడిశెట్టి కిట్టయ్య, పూలశన వెంకటరావు, పిన్ని వెంకన్న, ఉమ్మిడిశెట్టి నాగన్న తదితరులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రైతులు ఫిర్యాదు చేశారని ఇంకా కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.